''నేను జీవితంలో చేసింది ఒకే ఒక తప్పు. దానికి దేవుడు ఈ విధంగా ఏడిపిస్తాడనుకోలేదు'' అంటూ రేడియోలో చెబుతోంది ఎఫ్.యమ్ రేడియోలో పనిచేసే ముద్దుగా వుండే భార్గవి ముక్కులెగరేస్తూ.

''నేను జీవితంలో చేసినవి రెండే రెండు తప్పులు. అందుకే దేవుడు రెండు విధాలుగా ఏడిపిస్తున్నాడు.'' అంటూ న్యూస్‌పేపర్‌తో చెప్పుకుంటున్నాడు తనగోడు సాఫ్ట్‌గా వుండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆనంద్.

''ఏమిటో నువ్వు చేసిన ఒకే ఒక తప్పు?'' ఈసారి వస్తువుల్ని వదిలేసి సూటిగా పెళ్ళాన్ని అడిగాడు ఆనంద్.

''ఇంకేంవుంది తమర్ని లవ్ చెయ్యడం. మరి తమరు చేసిన రెండు తప్పులేంటో'' ప్రశ్నకి ప్రశ్నే జవాబిచ్చింది భార్గవి.

''నిన్ను ప్రేమించడం మొదటిది. పెళ్ళి చేసుకోవడం రెండవది''



# చలిమంటలు చిరుజల్లులు

**- పోలాప్రగడ జనార్ధనరావు (జెన్ని)**

''రేడియోలో నా గొంతు విని పీకలదాకా ప్రేమించి ఆహా! ఓహో అన్నదెవరో?''

''అది ఫిలిప్స్ రేడియో పెరఫార్‌మెన్స్ అని తెలియక''

''చుట్టాల పెళ్ళిలో నన్ను చూసి లొట్టలేసిందెవరో''

''కట్నం ఇచ్చుకోలేక తనలాంటి చెట్టుకింద ప్లీడరుకు కట్టబెడితే ఆ విషాధగాధ ఆంధ్ర దేశమంతా ఏదో వంకతో ప్రసారమవుతుందని జాలిపడి''

''అబ్బో విశాల హృదయం. షంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కంటే పెద్దది. మా నాన్నేం చెట్టుకింద ప్లీడరు కాదు. ఆయన ప్రాక్టీస్ చేసే చోట చెట్టుంది అంతే. అయినా ఇంట్లో విషయాలు బార్‌లో స్నేహితుల ముందు బాకా వూదిందెవరు?''

''బార్‌లో పర్‌మినెంటు మెంబర్ మీ నాన్న నేను కాదు. మొగుడితో గొడవలు రేడియోలో స్క్రిప్ట్ రాసే బ్రహ్మంగాడికి చెప్పి దాని మీద సెటైర్ రాయించింది ఎవరో?''

''ఇవన్నీ అనవసరం. మొన్న ఫస్ట్ షోకి వంటరిగా సినిమాకి వెళ్లిందెవరు? నేనా?''

''నిన్న సాయంత్రం చేసుకున్న ఉప్మా అంతా మింగిందెవరు? నేనా?''

''ఇంక రావనుకొని తింటే తప్పా?'' ఆగలేక దెబ్బలాటలో మేమూ ఉన్నాయన్నాయి ఆమె కళ్ళలో నీళ్ళు.

''వస్తాననుకొని ఉంచితే ముప్పా?'' ఈ సారి వాళ్ళ తగాదా చూసి వడ్ల గింజలో బియ్యపుగింజ ఫక్కున నవ్వింది.

పెళ్ళైన కొత్తలో పైపు లైనుల్లోంచి వచ్చే తాగు నీటి లాంటి వాళ్ళ మాటలు ఏడాది తిరక్కుండానే మేన్‌హోల్ నుంచి వచ్చే మురుకు నీటి ప్రవాహంలా తయారయ్యాయి. శని, ఆదివారాల్లో వయస్సు చేసే అల్లరి వల్ల సర్దుకుని పోయినా, సోమవారం నుంచి శుక్రవారం వరకు ఆఫీసుల్నించి అలసిపోయి వచ్చి ఎదురుగా వున్న వస్తువులమీద, పిల్లి మీద ఎలక మీద వంకపెట్టి వాదించుకోవడం అలవాటైపోయింది. ఇంట్లో వస్తువులన్నీ ఈ మాటల తూటాలని గమనిస్తూనే వున్నాయి. ఈ మధ్య శనాదివారాలు కూడా అడపా దడపా మిగతా వారాలతో జత కలుపుతున్నాయి. ఎంచక్కా వారం అంతా రెస్టు దొరుకుతోందని సంబరపడింది డబుల్ కాట్ ఒక్కటే.

అప్పుడే కథ క్లయిమాక్స్ వచ్చేలావుందని చిరు భయంతో వాళ్ళ నాన్న చె.పి. అదే చలపతిని (ఎగస్ పార్టీవాళ్ళు చెట్టుకింద ప్లీడరు అంటూ వుంటారు) భర్తకి తెలియకుండా పిలిపించింది భార్గవి. ప్రతీ దాంట్లోనూ లాపాయింట్ భూతద్దంలో చూసి

కోర్టుకి లాగుతూ వుంటాడు. అడపాదడపా నాట కాలు డైరెక్ట్ చేస్తూ వుంటాడు ఆయన.

కాపురం తెగని తెలంగాణా సమస్యలా వుందని భార్యకి తెలియకుండా నాన్న కృష్ణారావుని అర్జెంటుగా పిలిపించాడు ఆనంద్. కృష్ణారావు రిటైర్డ్ టీచరు క్రమశిక్షణలో, నీతి నిజాయితీలో అందరూ తనలాగే వుండాలంటాడు. వివరంగా విషయం చెప్పి భార్య పార్వతమ్మను కూడా రమ్మ న్నాడు. ఆవిడ అప్పుడప్పుడు రచనలు చేస్తుంది. తన మాటలు వినేవాళ్ళు, తన కథలు చదివేవాళ్ళు కరువయ్యారన్న బాధతో భర్త మాట జవదాటనట్టు తలూపి ప్రయాణానికి తయారయ్యింది.

ఒక దుర్ముహూర్తాన కట్టకట్టుకొని ఒకేసారి హైదరాబాద్‌లో అందరూ కృష్ణా కమిటీ మెంబ ర్స్‌లా భార్గవీ ఆనంద్‌ల కాపురంలో లుకలుకల మీద సమగ్ర రిపోర్ట్ తయారు చెయ్యడానికి దిగారు.

***

రహస్య సమావేశాలు జరిగాయి. కాస్త ఆవే శాలు చల్లారిన తర్వాత మొగుడూ, పెళ్ళాన్ని కూర్చోపెట్టి రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు పెద్దలు. టెంపరరీగా పెద్దవాళ్ళమాటలు వింటారని ఆదివారం అవసరం గాబట్టి రాజీపడి బెడ్ రూమ్ లోకి వెళ్ళి తలుపేసుకుంటారని అనుకున్నారు. కాని పంతాలకి పోయి పక్కలు హాలులో వేసుకు న్నారు. శ్రమంతా వృధా అయిందే అని ముక్కు మీద వేలేసుకున్నారు ముగ్గురు పెద్దలు.

తెలతెల వారుతుంటే కొత్తరకం తుఫాను సింహద్వారం దాటి దేవుడి గదిలోకి ప్రవేశించింది. ఒకటో నంబరు తుఫాను హెచ్చరిక జారీ అయ్యింది సంసార సాగరంలో.

కృష్ణారావు స్నానం చేసి ఓంకారం మొదలుపె ట్టాడు. స్పీకరులో వినిపిస్తున్న మసీదులో నమా జులా ఖంగుమంది ఆయన కంఠం. విసుక్కుంటూ లేచిన ప్లీడరు చెలపతి ''న్యూసెన్స్ కేసు పెడతా నని'' మొహం కడుక్కోకుండా, కాగితం కలం వెతు కుతున్నాడు. ఓంకార తన్మయత్వంలో ఉన్న కృష్ణా రావు ఇదేం పట్టించుకోకుండా, అది అయిన వెంటనే విష్ణు సహస్రనామం అందుకున్నాడు. రెచ్చి పోయిన చె.పి. కూతుర్ని అల్లుడ్ని లేపడానికి హడా వుడి చేసాడు.

పార్వతమ్మ 'నేను సైతం సమిధనొక్కటి వేస్తా' అనుకుంటూ రంగ్రప్రవేశం చేస్తూ ''మా ఇంటా వంటా యిలాంటి అలవాట్లు లేవమ్మా. పాచింట్లో పడకలేమిటి?'' ''వేకువజామునె మేల్కొని పైకి వెడలివచ్చి పాచిపని దీర్చవలెన్ అన్నాడు కుమారి శతకంలో'' అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ బాత్‌రూమ్‌లోకి దూరింది.

ఆవలిస్తూ లుంగీ సర్దుకుంటూ ఛీ! అప్పుడే సోమవారం వచ్చేసిందా? నిన్నేగా ఆదివారం అంటూ లేచాడు ఆనంద్.

ఇంట్లో సామాను, ఇక మీరు మామీద వంక పెట్టి తిట్టుకోన ఖర్లేదు. మా వారసులొచ్చారు. ఇంటింటి భాగోతం ఇంక మొదలెట్టండి అని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నాయి.

''ఏంటి నాన్నా పొద్దునే గొడవ'' అంది లేటుగా లేచిన భార్గవి ఆవలిస్తూ.

''అది కాదమ్మా రాత్రి నేను కేసు స్టడీ చేస్తూ లేటుగా పడుకున్నా. తెల్లవారు ఝామున మీ మావగారు బాకా మొదలెట్టారు'' అంటూ ఇంకో బాత్‌రూమ్‌లోకి దూరాడు.

''మా నాన్నకి అన్నీ మంచి అలవాట్లే. రాత్రి కేసు పేరు చెప్పి బారుకెళ్ళే వారికి బాకా లాగే విని పిస్తాయి'' మాటకి మాట అంటించాడు ఆనంద్.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళబోయిన భార్గవి రెండు బాత్‌రూమ్‌లు ఎవరో లోపల గడియ పెట్టుకోవ డంతో కంగారు మొదలయ్యి కూచిపూడి చేసింది.

క్యాబ్ వచ్చే టైమయిందని ఇంతవరకు స్నానం కూడా చెయ్యలేదని గుర్తొచ్చి వంటింట్లోకెళ్ళి హడా విడిగా మొహం కడుక్కొని నెత్తిమీద నీళ్ళు జల్లు కొని గబగబా బట్టలేసుకొని, ఈవాల్టికి ఇంతే అని స్ప్రే చేసుకొని ఆఫీసుకు బయలుదేరాడు ఆనంద్.

''అత్తయ్యా నేను ఆఫీసుకి వెడుతున్నా. అన్నీ వంటింట్లో రడీగా వున్నాయి. నేను కేంటీన్‌లో తింటా'' అంటూ తుర్రుమంది భార్గవి. అత్తగా రంటే వంటలక్క అనుకుంటోంది చెప్తా చెప్తా... మా గురించైనా వంట చేసుకొని చావాలిగా అంటూ నడుం బిగించింది పార్వతమ్మ.

***

దంపతులిద్దరికి ఇంటికొచ్చామా, రైతు బజారి కొచ్చామా అనిపించింది. అక్కడ గొడవ వినేసరికి.

కుర్చీకోళ్ళు కదులుతుంటే మేకులు కొడుతు న్నాడు కృష్ణమూర్తిగారు. కార్పెంటర్ చలపతి మీద ఎగురుతున్నాడు. చలపతి కృష్ణమూర్తి గారితో గొడవ పడుతున్నాడు.

''అన్ని పనులు మీరే చేసేసుకుంటే మేం ఎలా బతుకుతాం'' అన్నాడు కార్పెంటర్.

''పని వుందని తీసుకొచ్చినవాడ్ని అడుగు నన్నెందుకడుగుతావు?''

''ఎవర్నడిగి ఈ పని చేస్తున్నారు మీరు?'' చల పతి ప్రశ్నిస్తున్నాడు.

''నే కన్నకొడుకు. వాడు కొన్న కుర్చీ. నేనెవరి దగ్గర పర్మిషన్ తీసుకోవలసిన అవసరం లేదు''

''యాకార్డింగు లేబర్ యాక్ట్...''

''మాటలు తిన్నగా రానీయండి. నేను కార్పెం టర్స్ యూనియన్ సెక్రటరీని. లేబర్ని కాదు. నాకి స్తానన్న రెండొందలు ఇచ్చి మీరు మేకులే కొట్టుకుం టారో పీకలే పట్టుకుంటారో తీరుబడిగా తేల్చు కోండి''

''రెండు మేకులు కొట్టడానికి రెండొందలా? నీ బాబుగారి మూట ఇక్కడ దాచావనుకున్నావా?'' రిటైర్ అయినా టీచర్ బుద్ధి ఎక్కడికి పోతుంది. స్కూలు పిల్లాడిని తిట్టినట్లు తిడుతున్నాడు.

''మీకు వాడ్ని తిట్టే అధికారం లేదు. వాడు నా క్లయింట్. వాడి తరఫున వకాల్తా పుచ్చుకుంటు న్నాను... యాస్ పర్ సెక్షన్...''

''నీ సెక్షన్లు నువ్వూ మూసీలో ములగండి. నాకనవసరం. ఫస్ట్ క్లాస్‌నుంచి టెన్త్ క్లాసు వరకు, ప్రతి క్లాసుకి నాలుగు సెక్షన్స్‌కి నలభై ఏళ్ళు పాఠాలు చెప్పినవాడ్ని. నాకు సెక్షన్స్ గురించి చెబు తావా? ఎంత ధైర్యం''


ముగ్గురూ ఒకేసారి గట్టిగా మాట్లాడ్డంతో రెండవ నెంబరు తుఫాను హెచ్చరిక జండా ఆ ఇంటి మీద రెపరెపలాడింది. పక్కింటి వాళ్ళు ఉచిత ప్రదర్శన చూస్తూ ఆనందిస్తున్నారు. ఏడాది నుంచి ఇరుగు పొరుగు వాళ్ళతో మంచివాళ్ళు అనిపించు కున్న ఆ దంపతులకి తలకొట్టేసినట్లు అయి, కార్పెంటర్‌కి డబ్బిచ్చి పంపేశారు.

***

''అమ్మగారో! ఈ రోజు నుంచి పనికి రానండి'' అంటూ బాంబు పేల్చింది పని మనిషి.

''ఎందుకు పనికిరావు. మాకు చక్కగా పనికొ స్తావు. అది సరే నిన్ను ఎవరైనా ఏదన్నా అన్నారా?''

''ఏంటమ్మా. అసలు ఆ ముసలావిడ మీకత్త గోరా! నాకత్తగోరా? నా ఎనకాలే తిరుగుతుంది. అది తోము, ఇది కడుగు. అది తుడు అంటూ చేసిన



పనే మళ్ళీ మళ్ళీ సేయిత్తుంది. అదేటి ఆ... ఆ 'మందర' అంటుంది. ముందరదాని సంగతి సెప్పండి. అది ఎవర్తి? నన్ను మాన్పించి ఆ మందల్ని పనిలో పెట్టుకుందామనుకుంటున్నారా?''

''దాంతో నీకు మాటలేమిటే? పని మనుషుల్ని ఎక్కడుంచాలో అక్కడ వుంచాలి'' అంటూ పార్వతమ్మ సీనులోకి ప్రవేశించింది.

''ఏంటమ్మా పనిమనిసి, పని మనిసి, అని అంత సులకనగా మాట్లాడతారు?''

''పనిమనిషి పని మనిషి కాకపోతే పట్టమహిషి అవుతుందా! కనకపు సింహాసనమున శునకంబు... దీన్ని చూసే రాసుంటాడు వేమన''

అంతే బాంబు పేలింది. పొగలేకుండా మంటలొచ్చాయి.

''అమ్మగోరూ! మీ యత్తగారు ఎళ్ళేదాకా మీ ఇంటి ముకం సూడను'' అంటూ దుశ్శాసనుడు రక్తంతో కాని ఈ జుట్టు ముడవను అన్న ద్రౌపదిలా ప్రతిజ్ఞ చేసి వెళ్ళిపోయింది పనిమనిషి జుట్టు ముడి విప్పుకుంటూ.

అత్తగారి వల్ల ఆస్థి రాలేదు కాని చేతినిండా అంట్లు వచ్చాయి భార్గవికి.

***

ఆనంద్ ఇంటి కొచ్చేసరికి తల్లీతండ్రి, మామగారు కారిడారులో కూర్చొని కరకరలాడే పకోడీలు తింటున్నారు. హమ్మయ్య వాతావరణం ప్రశాంతంగా వుంది. తుఫాను తీరం దాటినట్టు వుంది అని అనుకున్నాడో లేదో అలలు మళ్ళీ మొదలయ్యాయి.

పార్వతమ్మ పకోడి మీద పద్యం అందుకుంది. కరకరలాడు కొంచెమగు కారము కలుగు.. పద్యం పూర్తి చెయ్యకుండానే అది చెళ్ళపిళ్ళ వారు రాసారని చలపతి... కాదు కృష్ణశాస్త్రి రాసిందని కృష్ణమూర్తి వాదించుకుంటున్నారు.

''అసలు ఈ భావం మా అమ్మమ్మదట. ఓసారి తిరుపతి వెళ్ళినప్పుడు ఆశువుగా ఎవరితోనో అంటూంటే అటుగా వెడుతున్న తిరుపతి వెంకట కవులు విన్నార్ట. అన్నయ్యగారూ కాపీరైట్ యాక్ట్ కింద మనం కేసువెయ్యొచ్చా... వారసత్వంగా నష్టపరిహారం నాకొస్తుందా? మా మామయ్యకి వస్తుందా?'' అంటూ పార్వతమ్మ లాయరు చలపతిని, ఫీజు లేకుండా వాగింది.

ఓరి వీళ్ళ ఇల్లు బంగారం గాను వాదనలకి, పకోడిని కూడా వదలల్లేదు. శ్రీశ్రీగారుంటే, వింటే, ఎంత సంతోషించేవారో... ప్రశాంతంగా వుండటం అంటే వీళ్ళకి తెలియదా? ఇష్టం వుండదా? తగవులకి దారితీసే విషయాలు ఎందుకు మాట్లాడుకుంటారు. భార్గవీ నేనూ పకోడీలు చేసుకుంటె, ఒకళ్ళు పకోడీని పైకి ఎగరేస్తే ఇంకొకళ్ళు దాన్ని నోటితో పట్టుకోవాలి. పాయింట్లు ఎక్కువ వచ్చినవాళ్ళు నెగ్గినట్టు. నెగ్గినవాళ్ళ కోరిక ప్రకారం, ఆవేళ ఏవారమైనా ఆదివారంగా డిక్లేర్ చెయ్యాలి. అది ఒప్పందం. ఆడుకున్న ఆటలు గుర్తొచ్చాయి. పాడుకున్న పాటలు వినిపించాయి. ఏదో చెప్పలేని బాధ తన్నుకొచ్చింది ఆనంద్‌కి.

***

అరుగుమీద అరుపులు వినబడేటప్పటికి ఉలిక్కిపడ్డారు ఆనంద్, భార్గవీ.

''నేను తీసుకొచ్చినవాడు కె.జి.కి ఎనిమిది రూపాయలు యిస్తానంటున్నాడు. నువ్వు తెచ్చిన వాడు ఆరు రూపాయలే యిస్తానంటుంటే వాడ్నే సమర్థిస్తావేమిటి? వాడెదురుగా నా పరువు తీస్తున్నారు బావగారు'' అని అరుస్తున్నాడు కృష్ణమూర్తి.

''మీవాడు సరిగ్గా తూచడు. రెండు రూపాయలకి కక్కుర్తి పడితే మనకే బొక్క'' లాయరుగారి లాజిక్

''నాది కక్కుర్తి అంటావా? కాని కట్నం లేకుండా నీ కూతుర్ని నా కోడలు చేసుకుంటే నన్ను అంతమాట అంటావా? అసలు నేను పేపర్లు అమ్మనే అమ్మను''

''మీరమ్మకపోతే నేనమ్ముతా. నా కూతురు 'ఎక్స్' దినపత్రిక తెప్పిస్తుంది అవి అమ్ముతా. కావాలంటే నీ కొడుకు తెప్పించే 'వై' దినపత్రిక దాచుకో లేకపోతే అమ్ముకో''

ఇలా వియ్యంకులిద్దరూ ఇల్లు దద్దరిల్లేలా, పాత పేపర్ల మీద దుమ్ములేచేలా దెబ్బలాడుకుంటుంటే...

''నేను పాతపేపర్లు కొనడం మానేసానయ్యా. ఇంక జీవితంలో ఈ యాపారం సెయ్యను, ఈ యెంపికి రాను''

''అల్లా నువ్వు నిరుత్సాహం పడ్డానికి వీలు లేదు. నువ్వు నా క్లైయింటివి. ఈ విషయం కోర్టులో తేల్చుకుందాం''

''బాబయ్యా మీరు మాత్రం కోర్టుకెళ్ళకండి. నాకు బాగానే ఆస్థి వుండేది. మా ఆవిడా నేను చిన్న చిన్న తగాదాల మీద నేను గొప్పంటే నేను గొప్పని కోర్టుకెళ్ళాం. నేనీ స్థితికొచ్చానంటే అంతా కోర్టు పుణ్యమే బాబు'' అంటూ పేపరోపదేశం చేసి పరారయ్యాడు.

ఇదంతా గమనిస్తున్న దంపతులు ఏం తెలియనట్టు ఏం విననట్టు ఈ విషయంలో మాత్రం ఏకాభిప్రాయంతో నిశ్చయించారు.

***

''ఆనందూ... ఈ కుర్రాడు నా స్టూడెంటు. ఇక్కడే టి.వి.999 ఛానల్‌లో రిపోర్టర్'' అంటూ ఒక సన్నపాటి భూతద్దాల కళ్ళజోడు, చెవిటి మిషను చెవిలో ఉన్న అతన్ని పరిచయం చేసాడు కృష్ణమూర్తి. నమస్కారం పెట్టి ఇప్పుడే వస్తానని ఇంట్లోకెళ్ళి 'నాన్నా ఓసారి లోపలికిరా' అంటూ పిలిచాడు.

''ఆయనేం రిపోర్టర్ వినబడుతుందా? కనబడుతుందా? అదీ కాకపోయినా ఆయన్నెందుకు పిలిచావు?''

''సరిగ్గా విననివాడు, కనబడని వాడే మంచి రిపోర్టర్‌గా పేరు తెచ్చుకుంటార్రా. మీ విషయం మీదే పిలిపించా. నీ భార్య నీతో ఇంకా గొడవ పెంచుకుందనుకో. మనం ఛానల్‌ని ఉపయోగించుకుందాం''

## వాటికి ఇక నేను దూరం

ప్రియాంకా చోప్రా తీసుకున్న నిర్ణయం నిర్మాతల గుండెల్లో బాంబులు పేల్చేటట్టుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. గతంలో ప్రేమ సన్నివేశాలంటే ఎంతో ఉత్సాహం చూపే ప్రియాంక ఇప్పుడు వాటికి దూరంగా ఉంటానని అంటోంది. ఇక మీదట ముద్దు సన్నివేశాలు చేయనని చెపుతోంది. ఈ మేరకు ఓ సినిమా షూటింగ్‌లో తన నిర్ణయాన్ని తూచా తప్పకుండా పాటించిందట కూడా! తప్పని సరై ఆ దర్శక నిర్మాతలు ఆ సీన్‌ని సినిమా నుంచి తొలగించారట! గతంలో తాను ఎలా ఉన్నా, ఇక మీదట పద్ధతిగా ఉండాలని అనుకుంటోందట! అందులో భాగమే ఈ కఠిన నిర్ణయమని కూడా అంటున్నారు.



"నాన్నా! కథను కంచికి చేర్చమంటే కాటికి తీసుకెళ్ళేలా వున్నావు? ఇదెక్కడకి దారి తీస్తుందో ఏమో" అనుకుంటూ మతి స్థిమితం లేకుండా ఆఫీసుకెళ్ళాడు ఆనంద్. అతనటు వెళ్ళగానే ఇటు ఓలా వుపాటి పిన్నిగార్ని తీసుకొని ఇంట్లోకి వచ్చాడు లాయర్ చలపతి.

"అమ్మాయి భార్గవీ ఈవిడ సుబ్బమ్మగారని 'లా'లో నా క్లాసుమేటు. ఇక్కడ స్త్రీ జనాభ్యుదయ సంఘం పెట్టి, లేడీస్ ప్రాబ్లమ్స్... అదే సమస్యలు తన భుజం మీదేసుకొని వాలంటరీగా డీల్ చేస్తున్నారు. ఈవిడ వెనకాల మంచి బలం వుంది"

ఆవిడ బరువే ఆవిడ మోయలేకపోతుంది. ఆవిడ వెనక బలం వున్నమాట నిజమే అనుకుంది భార్గవి.

"మంచి కార్యకర్తలు, మొగుడు వదిలేసిన వాళ్ళు, మొగుడ్ని వదిలేసిన వాళ్ళు, వేరే మొగుళ్ళని వదలకుండా పట్టుకున్నా స్వచ్ఛందంగా సేవ చేసే వారున్నారు" అన్న తండ్రి మాటలకి, అసలు ఎందుకు తీసుకొచ్చాడో అనుకుంటూ నమస్కారం పెట్టి కూర్చుంది.

"మనం దీక్షను పకడ్బందీగా ఒకదాని తర్వాత ఒకటి చేద్దాం. ముందర ప్రెస్ మీట్ పెడదాం. తరువాత ఇంటిముందు ధర్నా చేద్దాం. అవసరం అనుకుంటే నిరాహారదీక్ష చేయిద్దాం. ఈ విభాగంలో ఇద్దరు ముగ్గురు స్పెషలిస్టులున్నారు. వాళ్ళకి ఏదో కడుపుకి సంబంధించిన వ్యాధి వుంది. వారం రోజుల వరకు తిండీ, నీళ్ళు లేకపోయినా ఏం అవదు" అంది సుబ్బమ్మ.

చిలికి చిలికి గాలివాన అయ్యేలా వుంది. ఎందుకైనా మంచిది ఆనంద్‌కి సమయం చూసి చెప్పాలనుకుంది భార్గవి.

మూడవ నెంబరు తుఫాను హెచ్చరిక ఎగరేసారు తల్లిదండ్రులు.

***

"మీ మిసెస్ భార్గవి కళ్ళు తిరిగి ఆఫీసులో పడిపోయింది ఆనంద్‌గారు" అని ఫోన్ వచ్చేసరికి శెలవు పెట్టి పరిగెత్తాడు ఎఫ్. ఎమ్. రేడియో ఆఫీసుకి.

తను స్నేహితుడు డాక్టర్ హరికృష్ణ దగ్గరికి తీసుకెడితే ఏవో టెస్టులు రాసిచ్చి, చాలా వీక్‌గా వుందిరా, ఓ వారం రోజులు శెలవు పెట్టి రెస్టు తీసుకోమన్నాడు.

"బాబోయ్" ఇల్లుకంటే ఆఫీసు పదిలం. నేను శెలవు పెట్టనంది.

"ఆనంద్ మనిద్దరం కడుపు నిండా తిని, కంటి నిండా నిద్దరపోయి నోటినిండా కబుర్లు చెప్పుకొని ఎన్ని రోజులయిందో ఏదైనా హోటల్‌కెళ్ళి లంచ్ చేద్దాం. ఈ రోజు నేను భోజనం చెయ్యలేదు. క్యాంటీన్ మూసేశారు దాంట్లో పనిచేసే మొగుడూ పెళ్ళాలు కొట్టుకొని"

మనస్సు చివుక్కుమంది ఆనంద్‌కి. ఇద్దరూ హోటల్‌కెళ్ళి కడుపునిండా భోజనం చేశారు.

"ఆనంద్ మనమిద్దరం ఇలా హాయిగా వుండి ఎన్నాళ్ళు అయింది?"

"అవును చాలా రోజులయింది"

భార్గవికి ఏదో ఆలోచన వచ్చింది. ఆనంద్ చెవిలో గుసగుసలాడింది.

"నువ్వేం అనుకోనంటే ఈ పని చేద్దామా?"

"నీకిష్టమైన పనులు ఎన్ని అయినా చేస్తాను" అన్నాడు చిలిపిగా చూస్తూ.

"అవును మనం చేసిన పనులు మనమే దిద్దుకోవాలి"

"అలా ఆనందంగా వుంటే ప్రతిరాత్రీ వసంత రాత్రే"

"వసంత ఋతువు రావడానికి ఇంకా చాలా టైముంది... అందుకని..."

"వూ అందుకని"

"ప్రతివారం ఆదివారమే" అంది సిగ్గుపడుతూ

***




పెద్ద కేసొచ్చిందనీ, వివరాలతో ఎస్.ఎమ్.ఎస్. వచ్చింది చలపతికి. అర్జంటుగా వెళ్ళాలి మీ కేసుకంటే అది ముఖ్యం అంటూ ప్రయాణమయ్యాడు. "వెడుతూ వెడుతూ నీతులు చెప్పడానికి నేను సినిమా తండ్రిని కాదమ్మా. గోటితో పోయేదానికి గొడ్డలి ఉపయోగించకూడదు జాగ్రత్త" అంటూ వెళ్ళిపోయాడు.

"చెల్లాయికి నలతగా వుందట నాన్నా! అసలే ఒట్టి మనిషి కూడా కాదు బావ ఫోను చేసాడు"

"అవునా ప్రథమ కాన్పు. మేం దగ్గర లేకపోతే ఎలా" అని తల్లీ తండ్రి తిరిగి ప్రయాణం అయివెడుతూ.

"మాష్టారు కొట్టాడంటె కోపంతో కాదురా! భయభక్తులు కోసం. భయం, భక్తి వున్నవాడు జీవితాన్ని వృధా చేసుకోడు" అన్న తండ్రి మాటలకి తల వంచుకున్నాడు ఆనంద్.

"చూడమ్మా! నేనేం గయ్యాళి అత్తగార్ని కాదు. నేనూ నీలాగా ఒకప్పుడు కోడల్నే. గుప్పిడి మూస్తేనే అందులో ఏముందో ఎవరికి తెలియదు. గుట్టుగా కాపురం చేసుకుంటే నలుగురికి లోకువ అవ్వం" అంటూ వెళ్ళిపోయారు అత్తామామలు.

ఇల్లు చిన్నబోయింది. ఇంతలో ఫోను మోగింది.

"కంగ్రాచ్యులేషన్స్ ఆనంద్, నువ్వు తండ్రివి కాబోతున్నావు" హరికృష్ణ అనేసరికి

"ఎవరికి?" పరధ్యానంలో అడిగాడు.

"నాకురా యూస్‌లెస్ ఫెలో. భార్గవి తల్లి కాబోతుంది"

"ఎవరికి? అని ఇంక అడగను అర్థమయింది" అంటూ ఫోను పెట్టేసాడు.

"భార్గవీ కంగ్రాచ్యులేషన్స్, ముబారక్, శుభాకాంక్షలు... ఎన్నెన్నో... నేను... నేను..."

"నాకు అనుమానం వచ్చింది"

"ఎవరికి నా మీదా!"

"ఛీ ఫో! నీమీద కాదు. నా ఆరోగ్యం మీదా, రిపోర్ట్స్ రిజల్టులు వచ్చాక కన్‌ఫర్మ్ చేసుకోవచ్చు అని వూరుకున్నా..."

"అయ్యో ఇలాంటి సమయంలో అత్తయ్యగారుంటే ఎంత సంబరబడిపోయేవారు. అనవసరంగా మనకేం తెలీనట్టు నాటకం ఆడి పంపించేసాం"

"నువ్వేం బాధపడకు. ఇలాంటప్పుడే ప్రశాంతంగా వుండాలి. అదీ వుండాల్ట. నెలలు నిండాక మీ అమ్మగారి దగ్గరకి వెడుదువుగాని"

"థ్యాంక్యూ" అంటూ గట్టిగా కౌగిలించుకుంది.

"మెల్లగా. బుజ్జిగాడికి నెప్పెడుతుంది" అన్నాడు ఆనంద్ గడుసుగా.

***

తుఫాను తీరం దాటింది. ప్రమాదం లేదని ఈసారి నిజంగానే వాతావరణ శాఖ ఎనౌన్స్ చేసింది.

రైల్వేస్టేషన్‌లో వియ్యంకులు కలుసుకున్నారు.

"బావగారు! ఏంటో అనుకున్నాను గానీ మీరు మంచి యాక్టరు. నేను చెప్పిందానికంటే బాగా యాక్ట్ చేసారు" అన్న మాటలకి మీరు మరీ మంచి దర్శకులు అని అంటే... నేను మంచి రచయిత్రిని కానా?" అంటూ ఆనందంగా ముగ్గురూ నవ్వుకున్నారు.

పిల్లల చిన్న తగవులు చిరుజల్లులు అయినందుకు, చలిమంటలు చితిమంటలు కానందుకు.

★

రచయిత సెల్ : **98491 42361**